బోనం.. వైభవం

- భక్తిశ్రద్ధలతో గోల్కొండ బోనాల 2వ పూజ
- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు





గోల్కొండ: జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 2వ పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. ఉదయం 6 గంటల నుంచే మహిళలు తమ తమ కుటుంబాలతో గోల్కొండ కోటకు చేరుకున్నారు. గోల్కొండ కోటలోని నగిన బ్యారక్స్, నగినాబాగ్ తదితర ప్రాంతాల్లో నైవేద్యం తయారు చేస్తూ కొందరు మహిళలు సందడి చేశారు. మరికొందరు బోనం కుండలను అందంగా అలంకరించారు. ముందుగా భక్తులు నగినాబాగ్‌లోని నాగదేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మతల్లి దర్శనానికి కోటపక్కన ఉదయం 8 గంటల నుంచే రామ్‌దేవ్‌గూడ, ఫతేదర్వాజ, బంజర్‌దర్వాజా తదితర మార్గాల గుండా భక్తులు కోటకు బయల్దేరి వచ్చారు. ప్రధాన రహదారులపై డప్పు వాయిద్యాలతో భక్తి గీతాలు పాడుతూ..నృత్యాలు చేశారు. కోట ప్రధాన ద్వారం వద్ద బాలపోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శివసత్తుల పూనకాలను వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు.

నగిన బ్యారక్‌లో యువకుల హల్‌చల్..

నగిన బ్యారక్‌లో గుంపులుగా వచ్చిన యువకులు హల్‌చల్ చేశారు. భక్తిగీతాలు పాడటం, డ్యాన్సులు చేయడంలో యువకుల గ్రూప్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. యువకులు అంతటితో ఆగకుండా ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ భక్తులను భయపెట్టించారు. సమయానికి అక్కడే ఉన్న పోలీసులు వారిని సముదాయించి వారిని బయటకు పంపించారు.





కోటలో భక్తుల సందడి



నాగదేవత పుట్టవద్ద ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చంటిబాబు







మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజలు

అమిత్‌షాను కలిసిన ఎమ్మెల్యే రాజాసింగ్



అబిడ్స్: నగరానికి వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కలిశారు. ఆదివారం బేగంపేట విమానాశ్రయంలో ఆయనకు రాజాసింగ్ శాలువాతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ..కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అభివృద్ధి రూపంలో నెరవేరుస్తుందన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఆచరణలో అమలు చేసిందన్నారు.

కోట మైసమ్మ బోనాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: కోట్ల అలిజాలోని కోట మైసమ్మ ఆలయం బ్రోచర్‌ను ఆదివారం భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ గాజుల అంజయ్య విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ.. తెలంగాణలోనే మూడంతస్తుల్లో అమ్మవారు కొలువుదీరిన ఏకైక మందిరం కోట మైసమ్మ అమ్మవారన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రతి అంతస్తులో కోట మైసమ్మ వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ అధ్యక్షుడు రాయికోటి బాబురాజా, కోశాధికారి ప్యారసాని వెంకటేష్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో మీర్జా అలీ బేగ్‌కు బ్రాంజ్ మెడల్



చార్మినార్: హరియాణాలో జరిగిన 6వ జూనియర్ జాతీయ బాక్సింగ్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో పాతబస్తీకి చెందిన మీర్జా అలీ బేగ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ మేరకు షంషీర్‌గంజ్‌లోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీ కోచ్ హబీబ్ ముస్తఫా అతనిని ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో 52–54 కేజీల విభాగంలో మీర్జా అలీ బేగ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. మీర్జా అలీ బేగ్ యువ బాక్సర్లకు ఆదర్శంగా నిలిచారని హబీబ్ ముస్తఫా కొనియాడారు.

వైభవంగా రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో రెండో రోజైన ఆదివారం రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం వైభవంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ మహాయాగం 21 రోజుల పాటు కొనసాగనుంది. యాగం సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



చాంద్రాయణగుట్ట: సయ్యద్ అలీ చబుత్రాలోని రాధాకృష్ణ ఆత్మారామన్ మందిర్ కమిటీ తరఫున ఆదివారం లాల్‌దర్వాజా ఆలయ పరిసరాలలో జగన్నాథ రథయాత్ర ఊరేగింపు వైభవంగా కొనసాగింది. ఆలయంలో ఉదయం హారతి, ఛప్పన్‌భోగ్ తదితర పూజా కార్యక్రమాలను కమిటీ ప్రతినిధులు శ్రవణ్ ప్రభు, సూరజ్ ప్రభు, రాజేష్ కుమార్ సింగ్ ప్రభు తదితరులు కొనసాగించారు. అనంతరం ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పోలీస్ బందోబస్తు నడుమ లాల్‌దర్వాజా, బాలాగంజ్, గౌలిపురా మార్కెట్, సుధా టాకీస్, లాల్‌దర్వాజా మోడ్‌ల మీదుగా ఆలయం వరకు చేరుకుంది. దారి పొడవునా భక్తులు రథానికి స్వాగతం పలికారు.

వందే భారత్ నటీనటులకు స్ఫూర్తి అవార్డుల ప్రదానం



స్ఫూర్తి అవార్డులు పొందిన వందే భారత్ నటీనటులు

నాంపల్లి: దేశభక్తి, తీవ్రవాద నిర్మూలన వంటి ప్రధాన అంశాలతో నిర్మించిన వందే భారత్ సేవ్ ఇండియా సినిమా సమాజానికి అవసరమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో వందే భారత్ నిర్మాతకు, నటులకు దేశభక్తి అవార్డులను అందజేశారు. ఇటీవల భారత్ పాకిస్తాన్ యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకుని వందే భారత్ చిత్రానికి అవార్డులు ఇచ్చినట్లు అకాడమీ చైర్మన్ ఆకుల రమేష్ ప్రకటించారు. దర్శక నిర్మాత కళారత్న మల్లం రమేష్‌ను ఈ సందర్భంగా సత్కరించి అవార్డును అందజేశారు. వీరితో పాటు నటులు మాణిక్, ఘర్షణ శ్రీనివాస్, గాయకులు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బి.కుమార్, మహతి, ఇతర నటులు బీడీఎల్ సత్యనారాయణ, రామడుగు వసంత్, భవిరి శివ, మహ్మద్ జమా, విజయ్, అనిత, సచిన్, ఆకాశవాణి ప్రభు, కెనడాకు చెందిన రవళి, కో డైరెక్టర్ అమీర్ కజ్రాని వందే భారత్ దేశభక్తి అవార్డులను అందుకున్నారు. ట్రావెల్ ఫిల్మ్, ఆధ్యాత్మిక, లఘు చిత్రాలు నిర్మించిన మేఘనకు ప్రోత్సాహక అవార్డు ఇచ్చారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ నేత డాక్టర్ అలీ భాయ్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి, సామాజిక వేత్త డాక్టర్ సుదర్శన్ గౌడ్ అతిథులుగా హాజరై గ్రహీతలకు అవార్డులను బహూకరించారు.

సమాజ సేవకు 'ఆర్యవైశ్య మహా సభలు' అంకితం



మాట్లాడుతున్న కోలేటి దామోదర్ గుప్తా

జియాగూడ: సమాజ సేవ కోసం హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభతో పాటు తెలంగాణ రాష్ట్ర నలుమూలలా ఆర్యవైశ్య మహాసభలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో తరచూ వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆదివారం హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, దూద్‌బౌలి ఆర్యవైశ్య మహా సంఘాలు ఉచితంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా దామోదర్ గుప్తా మాట్లాడుతూ..నిరంతరం సమాజ సేవకే వైశ్య మహాసభలు పాటుపడుతాయన్నారు. జయరాములు గుప్తా, అల్లాడి నాగభూషణం గుప్తా, నీరంజన్‌యాదవ్, సరాబు లక్ష్మణ్‌గుప్తా, రేపాక వెంకటేశ్వర్లు, కటకం శివకుమార్‌గుప్తా, లింగప్రకాష్ గుప్తా, దేవత శ్రీనివాసరావు, బోత్స సంతోష్‌కుమార్‌గుప్తా, దోరేటి ఆనంద్‌కుమార్ గుప్తా, డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ కరణ్ పటేల్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ జయశంకర్ తెడ్లలు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంపై అధికారుల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రాజువస్తాద్, దయానంద్ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళి అమ్మవారి ఆలయంపై దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారని గోల్కొండ పీస్ కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. ఆదివారం గోల్కొండ కోటలో ఆయన దేవాదాయ శాఖ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. జగదాంబిక అమ్మవార్లచే దేవాదాయ శాఖ అధికారులు బంగారు ఆభరణాలతో అలంకరిస్తున్నారని పక్కనే ఉన్న మహంకాళి అమ్మవారికి ఒక మాసం బంగారు ఆభరణాలు కూడా లేకపోవడంలో అధికారులు మతబలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాటు చేసిన ఈ బోర్డును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దయానంద్, బి.జంగయ్య, అశోక్ కుమార్, రాంబాబు యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



విజయనగర్‌కాలనీ: దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరం 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆలయ ప్రాంగణంలో భక్తబృందం ఆదివారం ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు పి.సత్యంచారి, ఉపాధ్యక్షుడు పుష్పాల సుదర్శనం, ప్రధాన కార్యదర్శి బి.రమేష్‌కుమార్, సహాయ కార్యదర్శి దాస శ్రీనివాస్, కోశాధికారి సామల శ్రీనివాస్, ఉత్సవ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్, గురునాథ్, అంజయ్యయాదవ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్



శాలిబండ: పాతబస్తీలోని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం చివరి రోజు కావడంతో సాయంత్రం ఏడు గంటల వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ నిర్వహించారు. శనివారం వరకు 822 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూలై 1 నుంచి వెబ్ ఆప్షన్ ప్రక్రియ కొనసాగుతుందని అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ వంశీ విక్రం తెలిపారు.

ధూల్‌పేట్‌లో ఘనంగా బోనాలు

అబిడ్స్: ధూల్‌పేట్‌లో ఆదివారం లోద్ కులస్తులు బోనాల (బగిచా) వేడుకలు నిర్వహించారు. గంగాబౌలిలోని అమ్మవారి ఆలయం వద్ద బోనాల పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, రాకేష్ సింగ్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.



వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గౌలిపురా: గౌలిపురా ఆరె కటిక సూర్యవంశీ సంఘం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఆరె కటిక సంఘం భవనంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. డాక్టర్ బర్మా భగీరథ్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆరె కటిక సంఘానికి చెందిన ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా భగీరథ్ రాజ్ మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తే ఆశించిన ఫలితాలను సాధించవచ్చునన్నారు. ఆరె కటిక సంఘం ప్రతినిధులు జమాల్‌పూర్ గంగాధర్, డి.గోపాల్‌తో పాటు మహవీర్ ప్రసాద్, యశ్వంత్‌రావు, రమేశ్, బాబురావు, మారుతీరావు, దశరథ్ రాజ్, రఘురాం పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న బర్మా భగీరథ్ రాజ్, సంఘం ప్రతినిధులు

వార్షికోత్సవం

గన్‌ఫౌండ్రీ: ధృపద్ గురుకులం ఫౌండేషన్ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రవీంద్రభారతిలో సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత ధృపద్ సంగీతకారుడు మనీష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శతాబ్దాల క్రితం ఆలయాల నుంచి ఉద్భవించిన పురాతన భారతీయ హిందూస్థానీ శాస్త్రీయ సంగీత రూపకమైన ధృపద్‌ను సంరక్షించి ప్రోత్సహించడంతో పాటు ప్రచారం చేయడం ఫౌండేషన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు మీనా, అశోక్‌లతో పాటు పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



నల్లపోచమ్మకు వెండి బహూకరణ



ఆలయ నిర్వాహకులకు 2.2 కిలోల వెండి బహూకరిస్తున్న అరవింద్‌కుమార్ గౌడ్

గోల్కొండ: సబ్జిమండిలోని నల్లపోచమ్మకు సేవ చేయడం తన అదృష్టమని ప్రముఖ సంఘసేవకుడు టి.అరవింద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం కార్వాన్ సబ్జిమండిలోని నల్లపోచమ్మకు 2.2 కిలోల వెండిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ వెండితో అమ్మవారికి వెండి కవచం, కిరీటం తయారు చేయించాలని, దీనికి అయ్యే ఖర్చులు కూడా ఇస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్, కోశాధికారి డి.గోపాల్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

గౌలిపురా: రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తలాబ్‌కట్టా చాచా గ్యారేజీ సమీపంలో తలసేమియా బాధపడుతున్న రోగులకు రక్తాన్ని అందించేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రాణపాయ స్థితిలో వ్యక్తిని కాపాడేందుకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 80 మందికి పైగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నరేందర్‌రెడ్డి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

ఆక్యుప్రెషర్ వైద్యంతో దీర్ఘకాలిక రోగాలకు చెక్

విజయనగర్‌కాలనీ: ఆక్యుప్రెషర్ వైద్యంతో దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చని కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుప్రెషర్ అండ్ నేచిరోపతి కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ సుధాకర్, ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంఎల్.ఆనందరావు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో సీఐఏఎస్ కళాశాల 11 స్నాతకోత్సవం నిర్వహించి ఆక్యుప్రెషర్‌లో డిప్లొమా పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు. ఆరోగ్య ప్రాధాన్యాన్ని తెలుపుతూ సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేష్, చిదంబరం, డాక్టర్ పీఎల్‌కే దుర్గ, జ్యోతి, శ్రీదేవి, పూర్ణాచారి, వినోద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎంఎల్.ఆనంద్‌రావు, డాక్టర్ సుధాకర్

'పాతనగర అభివృద్ధిని అడ్డుకుంటున్న మత రాజకీయాలు'

చాంద్రాయణగుట్ట: పాతనగరం అభివృద్ధి చెందకుండా రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా అన్నారు. సీపీఐ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నాలుగో మహాసభలు ఆదివారం మిల్లత్ ఫంక్షన్‌హాల్‌లో మహ్మద్ సలీం అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా నర్సింహా హాజరై మాట్లాడుతూ..పాత నగరంలో అభివృద్ధి జరిగి విద్య, ఉద్యోగ రంగాల్లో యువత అవకాశాలు పొందితే తమ మాట చెల్లుబాటు కాదని దురుద్దేశంతోనే నిరంతరం మత ఘర్షణలకు పాల్పడుతున్నారన్నారు. పాత నగరంలో మెట్రో రైలు ప్రారంభించాలని సీపీఐ అనేక దఫాలుగా వివిధ పద్ధతుల్లో పోరాటాలకు రూపకల్పన చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యుడు నేర్లకంటి శ్రీకాంత్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, నాయకులు ఇమ్రాన్, షహీన్, షబ్బీర్, గౌస్, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాలు



చార్మినార్: తుల్జాపూర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ బోనాలను పురస్కరించుకుని ఆదివారం తుల్జాభవాని అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. డబీర్‌పురాకు చెందిన భక్తులు బోనాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఘటం పరిసమాప్తి సామూహిక ఊరేగింపును వైభవంగా నిర్వహించనున్నారు. దీంతో రెండు రోజుల పాటు తుల్జాపూర్‌లో బోనాల జాతర ఉత్సవాలు ముగుస్తాయని డబీర్‌పురా పంచదుర్గ ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధులు ఘటం నాగేష్, పోతురాజ్ నర్సింగ్, లింగాల ప్రేమ్‌కుమార్, పి.ఆనంద్, నక్కా మహేందర్‌గౌడ్ తదితరులు తెలిపారు.